# హత్య

నవీన్

గురవయ్య బొమ్మను తయారుచేశాడు. చాలా వికృతంగా తయారైంది. చిన్న కళ్ళు, పుల్లల్లాంటి పొడవైన చేతులు, కాళ్ళు, పెద్ద బొజ్జ.

ఆ బొమ్మను చేతుల్లో పెట్టుకొని అటూ ఇటూ తిప్పి చూశాడు. తృప్తిగా నవ్వుకున్నాడు.



ఆ బొమ్మను గుడలతోతయారుచేశాడు. మీద రంగు కాగితాలు అంటించాడు. తర్వాత తన డ్రాయరు సొరుగులోఉన్న గుండుసూదులు తెచ్చి ఒక్కొక్క సూదిని ఆ బొమ్మకు గుచ్చసాగాడు. ఆ పనిచేస్తున్నంతసేపు అతనికి బ్రహ్మానందంకల్గింది. "రోజూ నీ సూదుల్లాంటి తిట్లతో, మెమోలతో నన్ను సరిగ్గా ఇలాగే హింసిస్తున్నావు కదూ! నేనేమీ చెయ్యలేననుకున్నావు గదూ! ఇదిగో చూడు...." అంటూ ఇంకో సూదిని ఆ బొమ్మకు గుచ్చాడు. తన దగ్గరున్న సూదులన్నీ అయిపోయే దాకా అతడలాగే చేశాడు.

తర్వాత ఆ బొమ్మను నేలమీద అటూ ఇటూ దొర్లించాడు. "అహహహ.... బాధతో ఎలా కొట్టుకుంటున్నాడో చూడు గాడిద కొడుకు! బాగా అయ్యింది. నన్ను రోజూ చంపుతున్నాడు. హింసిస్తున్నాడు యేడిపిస్తున్నాడు. రాసి రంపాన పెడ్తున్నాడు. ఈ రోజుతో నీకు మూడిందిరా, ఈ రోజు నిన్ను చంపేస్తాను. మామూలుగా చంపను. హింసించి, యేడిపించి, చిత్రవధచేసి మరీ చంపుతాను. నీ మీద ప్రతీకారం తీసుకోలేననుకుంటున్నావు కదూ." ఇలా కొంతసేపు ఆ బొమ్మతో మాట్లాడాడు.

మళ్ళా ఆ బొమ్మను నేలమీద అటూ ఇటూ దొర్లించాడు. కాళ్ళతో తొక్కాడు తన్నాడు యిలా కొన్సేపు చేసి ఆగిపోయాడు ఆ బొమ్మ చెయ్యి పట్టుకొని నాడి చూస్తున్నట్టుగా నటించాడు. వెంటనే లేచి 'చచ్చాడు.... మా ఆఫీసర్ చచ్చాడు. బాధకు తట్టుకోలేక టక్కున గుండె ఆగి చచ్చిపోయాడు. వీడ్ని ఇప్పుడిక దహనం చెయ్యాలి...." అన్నాడు.

బొమ్మమీద కిరోసిన్ పోశాడు. ఇంటి వెనుక దొడ్లోకి తీసుకుపోయాడు. అక్కడ కొన్ని కట్టెపుల్లల్ని యేరి చితిలా తయారు చేశాడు. చితిమిదకూడా కిరోసిన్ కుమ్మరించాడు. బొమ్మను చితిమీద పడుకోబెటి అగ్గిపుల్ల గీసి అంటించాడు. గుప్పుమని పెద్ద మంట లేచింది. అతడా మంటకేసి తదేకంగా చూడసాగాడు.

అకస్మాత్తుగా గురవయ్య యేడవటం మొదలెట్టాడు. "పాపం మా ఆఫీసర్ చచ్చిపోయాడు, నేనే చంపేశాను. రోజూ ఆఫీసులో నన్ను తిడ్తున్నాడని, పనిచెయ్యటం చేతకాదని నానా మాటలంటున్నాడని నేనే చంపేశాను. పాపం అతని పెళ్ళాం, పిల్లలు ఎంత ఏడుస్తున్నారో...."


ఆ మంట ఆరిపోయేదాకా గురవయ్య ఏడుస్తూనే ఉన్నాడు. తర్వాత వచ్చి పక్కమీద పడుకున్నాడు. అప్పుడు రాత్రి పన్నెండు గంటలవుతోంది. చాలా రోజుల తర్వాత అతనికి కంటినిండా నిద్ర పట్టింది.

## 2

గురవయ్య ఆ ఊరి రెవెన్యూ ఆఫీసులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. గురవయ్య చిన్ననాటినుండి వట్టి మొద్దబ్బాయిగా పేరుపొందాడు. ఎప్పుడూ నిద్ర మత్తు మొహంతో తిరిగే అతనికి యేపని చేయటానికి చేతనయ్యేది కాదు. అతడు పుట్టిన నాలుగైదు రోజులకే అతని తల్లి చనిపోయింది. పుట్టగానే తల్లిని చంపాడని అందరూ అతన్ని కసిరేవాళ్ళు.

గురవయ్య తండ్రి వడ్రంగం చేసుకుంటూ బతికేవాడు, అతని సంపాదనకు యేపూటకు ఆ పూట గడవటమే కష్టంగా ఉండేది. తన కొడుకును ఈ వృత్తిలోకి దింపేకంటె నాలుగు అక్షరాలు నేర్పించి యేదన్నా ఉద్యోగంలో చేర్పించాలని అతడు కలలు గనేవాడు. కాని యేడెనిమిది

# ప్రమాదీచ 1973 ఉగాది కథల పోటీలో మొదటి బహుమతి పొందిన కథ




యేళ్ళు వచ్చేదాకా గురవయ్యకు ఓనమాలే రాలేదు. బళ్ళోకెళ్ళి ఓమూల పడుకొని చక్కగా నిద్రపోయేవాడు. ఎన్నోసార్లు తండ్రి గురవయ్యను గొడ్డును బాదినట్లు బాదేవాడు. ఆ దెబ్బలకి తాళలేక "మా నాన్న చచ్చిపోతే నాకీదెబ్బలు తప్పేవి" అనుకునేవాడు గురవయ్య. గురవయ్యకు పదేళ్ళు వచ్చే టప్పటికి — అతడు రెండో తరగతి చదువుతుండగా — అతని తండ్రి అకస్మాత్తుగా చనిపోయాడు. తండ్రి చనిపోయాడని తెలియగానే గురవయ్యకు మనస్సులో చాలా సంతోషం కల్గింది. నేను మనసులో మా నాన్న చనిపోవాలని కోరుకోవటం వల్లనే మా నాన్న చనిపోయాడని" గురవయ్య నమ్మాడు.

గురవయ్యను వాళ్ళ మేనమామ తన ఊరు తీసికెళ్ళి ఆ ఊరి స్కూల్లో చదివించాడు. ఒక్కొక్క క్లాసులో రెండు మూడేళ్ళు గడుపుతూ గురవయ్య మొత్తానికి మెట్రిక్యులేషన్ అయ్యిందనిపించాడు.

గురవయ్య మేనమామే నానా తంటాలుపడి అతనికి గుమాస్తా ఉద్యోగం సంపాదించి, ఆ తర్వాత తన కూతుర్నిచ్చి పెళ్ళిచేశాడు.

గురవయ్య రోజూ ఆఫీసుకు వెళ్ళి రావటంతప్ప అతడు ఆఫీసులో చేసే పనేమీ ఉండేదికాదు. ఆఫీసుకు రాగానే టేబుల్‌మీద తలపెట్టుకొని, మీద ఫ్యాన్ వేసుకొని, చక్కగా నిద్రపోయేవాడు. టైమైందని ఎవరన్నా లేపితే లేచి ఇంటి కొచ్చేవాడు. తన సెక్షన్‌కు సంబంధించిన ఫైళ్లగాని, మరేఇతర వివరాలుగానీ అతనికి తెలియవు. వాటితో అవసరమున్నప్పుడు అతని పక్కనున్న క్లర్కులొచ్చి వాటిని చూసుకునేవాళ్ళు. గురవయ్య అదృష్టం బావుండి అతడు ఉద్యోగంలో చేరాక వచ్చిన ఇద్దరు, ముగ్గురు ఆఫీసర్లు చాలా మంచివాళ్ళు. ఆఫీసులో ఏం జరుగుతోందని వాళ్ళు పెద్దగా పట్టించుకునేవాళ్ళు కాదు. తమదగ్గర కొచ్చిన కాగితాలమీద టకాటకా సంతకాలు పెట్టేసి వాళ్లు వెళ్ళిపోతుండేవాళ్ళు. గురవయ్య సెక్షన్ సూప

# హత్య

రింటెండెంట్ మొదట్లో గురవయ్య నిద్రను పాడుచేయటానికి, అతనికి కొంచెం పని చెప్పటానికి ప్రయత్నించేవాడు. కాని గురవయ్యచేత పని చేయించటం స్టాలిన్లకు, హిట్లర్లకు కూడా సాధ్యం కాదని తెల్సుకొని ఆ ప్రయత్నం మానుకున్నాడు.

గురవయ్య ఖర్మంకాలి ఈ మధ్యనే క్రొత్త ఆఫీసర్ ఒకాయన వచ్చాడు. అతని పేరు కృష్ణమూర్తి. కృష్ణమూర్తి సామాన్యుడు కాడు. బండచేతకూడా పని చేయించగల టాస్క్ మాష్టర్. అసమర్ధతను, సోమరితనాన్ని ఏమాత్రం కూడా సహించేవాడు కాడు.

కృష్ణమూర్తిది భారీవిగ్రహం. ఆరడుగులకు పైగా పొడవుంటాడు. అంత పొడవుండటం వల్లనేమో చాలా సన్నగా కనిపించేవాడు. ఎదుటివాడిని నిశితంగా చూసే చిన్నకళ్ళు, విశాలమైన నుదురు, ఎప్పుడూ సీరియస్‌గా ఉండే మొహం.... కృష్ణమూర్తిని చూడగానే ఆఫీసులో అంతా హడలిపోయేవాళ్ళు.

యేపనైనా చకాచకా జరిగిపోవాలి.... ఫైల్స్ వెంటవెంటనే కదలాలి. ఆఫీసుకు పనిమీద వచ్చేవాళ్లు ఎక్కువసేపు నిల్చోకూడదు. తన ఆఫీసులో అవినీతి, లంచగొండితనం మొదలైనవి ఉండటానికి వీల్లేదు—ఇవీ కృష్ణమూర్తి ఎంతో జాగ్రత్తగా పాటించే నియమాలు. అతడు చార్జి తీసుకోగానే ఈ విషయాల్ని గూర్చి తన ఆఫీసులో పనిచేసే వాళ్ళందరికీ చెప్పాడు.

"మీకు ఎన్ని సౌకర్యాలు కావాలన్నా ఇస్తాను. కాని చక్కగా పనిచెయ్యండి. పనిని ఊరబెట్టకండి. తప్పించుకోకండి. క్విక్‌గా- పని ముగించుకొని సరిగ్గా టైమ్‌కు వెళ్ళిపొండి. మిమ్మల్ని ఓవరీ టైమ్ పని చెయ్యమని నేనెన్నడూ చెప్పను "ఐ లైక్ ఎఫీషెన్సీ. కాని ఇన్‌ఎఫిషెన్సీని నేను సహించను_అసమర్ధతను, సోమరితనాన్ని ఈ ఆఫీసులో ఎక్కడా నేను చూడకూడదు' అని కృష్ణమూర్తి ఒక మీటింగులో చెప్పాడు.

కృష్ణమూర్తి చార్జి తీసుకున్న క్షణం నుండి ఆ ఆఫీసు స్వరూపమే మారిపోయింది. గాఢాంధకారంలో ఓ వెయ్యి కాండిల్స్ ఎలక్ట్రిక్ బల్బు వెలిగినట్టయ్యింది.

కృష్ణమూర్తి స్వయంగా ప్రతిక్లర్కును కలిశాడు ఇన్‌స్పైర్ చేశాడు. ప్రోత్సహించాడు. ప్రతివాడిని ప్రభావితం చేసే ఒక గొప్పతనమేదో అతనిలో ఉంది.

కృష్ణమూర్తి ఎంత టాస్క్ మాష్టరైనా హృదయం లేనివాడు మాత్రం కాదని ఆ ఆఫీసులో అందరూ అంగీకరించారు. అందరితోను అతడు ఆప్యాయంగా మాట్లాడేవాడు. వాళ్ళ కష్టనిష్ఠూరాల్ని, కుటుంబ సమస్యల్ని తెలుసునేవాడు. సాధ్యమైనంత సహాయం చేసేవాడు. పనిలో లోపం జరిగితే మాత్రం క్షమించేవాడుకాడు.

అతడెప్పుడూ సరిగా టైమ్‌కు ఆఫీసుకు వచ్చేవాడు. టైమ్ కాగానే వెళ్ళిపోయేవాడు. మధ్యలో ఎక్కడకూ వెళ్ళేవాడు కాదు.

"ఈ రోజు కొత్త ఆఫీసర్ వస్తున్నాడు. ఈ రోజైనా నీ నిద్రను కాస్సేపు ఆపుకో" మని గురవయ్యకు అతని కొలీగ్స్ చెప్పినా అతనికి నిద్ర ఆగలేదు. గురవయ్య చక్కగా టేబుల్ మీద తల పెట్టుకొని ఫ్యాన్ కింద నిద్రపోతూ కృష్ణమూర్తికి కనిపించాడు. కృష్ణమూర్తి ముఖం చిట్లించాడు. వెంటనే గురవయ్యను తన రూమ్‌కు పిలిపించాడు.

"మళ్ళీ నాకు ఆఫీసులో నిద్రపోతూ కనిపించావో నువ్వికఈ ఆఫీసులో నిద్రపోవాల్సిన అవసరం లేకుండా చేస్తాను— హాయిగా మీ ఇంట్లోనే నిద్రపోవచ్చు" అన్నాడు.

గురవయ్య నిద్రమత్తు మొహంలో చలనం లేదు.

"అంటే అర్ధమయిందా?" అన్నాడు కృష్ణమూర్తి.

"కాలేదు" అన్నట్టుగా తల తిప్పాడు గురవయ్య—

"అంటే తమకి ఊష్టింగ్ ఆర్డర్ చేతికిస్తాను.... సరేగానీ నీ సెక్షన్ ఫైల్సన్నీ తీసుకురా....నేనోసారి చూస్తాను"అన్నాడు కృష్ణమూర్తి.

గురవయ్య వణికిపోయాడు_తన దగ్గరున్న ఫైల్సేమిటో, అవి తనదగ్గర ఎందుకున్నాయో అతనికి తెలియదు _ నిద్రలో నడిచి వెళ్ళినట్టుగా తన షెల్ఫ్ దగ్గరకెళ్ళి ఫైల్స్‌ని తీసుకెళ్ళి చూపెట్టాడు. ఆ ఫైల్స్ స్వరూపం చూసి కృష్ణమూర్తి మండపడ్డాడు.

"నీకెవడయ్యా ఉద్యోగం ఇచ్చింది. నీ అంత పనికిమాలినవాణ్ని నా జన్మలో చూళ్ళేదు, నీ వర్క్‌ను గూర్చి నీకు ఎ. బి. సి. డీలు కూడా తెలియనట్టుందే.... ఈ సెక్షన్‌లో ఎలా ఉంటున్నావయ్యా...."

కృష్ణమూర్తి వెంటనే సూపరింటెండెంట్‌ను పిల్చాడు. అతడు అసలు సంగతి చెప్పాడు.

"అవసరమున్నప్పుడల్లా అతని వర్క్ మేమే చూస్తున్నామండి. అతని కేమి తెలియదండి" అన్నాడు.

"ఇకనుండి అలా జరగటానికి వీల్లేదు. వెంటనే ఇతని సెక్షన్ మార్పించు. డిస్పాచ్ సెక్షన్‌లో కొంతకాలం యేడవమను" అన్నాడు కృష్ణమూర్తి.

గురవయ్యను డిస్పాచ్ సెక్షన్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు.

యేం జరిగినా గురవయ్యలో చలనం ఉండదు. అతడు ఎవరితోనూ యేమీ చెప్పుకోడు. అతనికా ఆఫీసులో ఫ్రెండ్సంటూ ఎవరూ లేరు. ఆ నిద్రమత్తు మొహంలో ఎప్పుడూ ఎలాంటి మార్పు కూడా కనిపించదు.

సెక్షన్ మారాక గురవయ్య కష్టాలు ఎక్కువయ్యాయి. గుట్టలకు గుట్టలు లెటర్స్ పడివుంటటంతో వాటిని యేరోజుకారోజు డిస్పాచ్ చెయ్యటం అతనికి సాధ్యమయ్యేది కాదు. నాలుగురోజుల కింద వెళ్ళాల్సిన ఉత్తరాలు ఈ రోజు వెళ్తుండేవి. ఒకరోజు కృష్ణమూర్తి డిస్పాచ్ సెక్షన్ కొచ్చి గుట్టలు గుట్టలుగా పడివున్న లెటర్స్ చూడనే చూశాడు.

గురవయ్యను బాగా తిట్టాడు. మళ్ళీ ఇలా జరిగితే ఊస్ట్ చేస్తానన్నాడు. ఇంత అసమర్ధుణ్ని తనెక్కడా చూళ్ళేదన్నాడు.

గురవయ్య ఈ మధ్య నిద్రపోవటం కొంచెం తగ్గించుకున్నాడు. కొంచెం చురుగ్గా పనిచేసే ప్రయత్నం చేస్తున్నాడు. కాని కట్టలు కట్టలుగా వస్తున్న అన్ని లెటర్స్‌ను యేరోజు కారోజు పంపించటమంటే అతనికి సాధ్యం కావటంలేదు.

మరోసారి కృష్ణమూర్తికి దొరికిపోయాడు. ఈ సారి కృష్ణమూర్తి యేమీ మాట్లాడలేదు. వారం రోజులపాటు గురవయ్యను సస్పెండ్ చేశాడు.

గురవయ్య మనసులో చిన్న సంచలనం ప్రారంభమైంది. చిన్నప్పుడు తన తండ్రి కొట్టిన దెబ్బలు జ్ఞాపకం వచ్చాయి. తన



తండ్రిలాగే ఈ ఆఫీసర్ కూడా వెంటనే చనిపోతే బావుండును అన్నకోరిక అతనిలో కల్గింది.

ఇలా ఉండగా. మరో సంఘటన జరిగింది.

తమ జిల్లాలో ఆ సంవత్సరం వర్షాలు ఏమాత్రం కూడా కురవని కారణంగా తల ఎత్తిన కరువు పరిస్థితుల్ని గూర్చిన స్పెషల్ రిపోర్టు గవర్నమెంట్‌కు పంపించటానికి కృష్ణమూర్తి స్వయంగా తయారుచేశాడు — యీ రిపోర్టు చాలా అర్జెంట్‌గా డిస్పాచ్ కావాలని స్పెషల్ నోట్ రాస్తూ డిస్పాచ్ సెక్షన్‌కు పంపించాడు. గురవయ్య అది గమనించ లేదు– ఆ రిపోర్టు యెక్కడో అడుగున పడిపోయింది — వారం రోజులదాకా అది అట్లాగే పడి ఉంది—

"మీ జిల్లాలోని కరువు పరిస్థితుల్ని గూర్చి మాకింకా రిపోర్టు రాలేదు–వెంటనే పంపించాల్సిందని' పైనుండి రిమైండర్ రావడంతో కృష్ణమూర్తి వెంటన గురవయ్యని పిలిపించి "ఫలానా రిపోర్టు డిస్పాచ్ అయ్యిందా?' అని అడిగాడు. "తనకేమి తెలియదన్నాడు" గురవయ్య.

కృష్ణమూర్తి తనే స్వయంగా వెళ్ళి డిస్పాచ్ సెక్షన్లో వెతికితే యేవో చెత్త కాగితాల్లో ఆ రిపోర్టు దొరికింది– కృష్ణమూర్తి ఆగ్రహానికి అంతులేకపోయింది.

"రోగ్... ఇడియట్ .... ఇన్‌ఫీషెంట్ ఫూల్.... నిన్ను వెంటనే డిస్మిస్ చేస్తున్నాను .... ....పో, నీ నిద్రమత్తు మొహాన్ని నాకు చూపించకు అంటూ నోటికొచ్చినట్లల్లా తిట్టాడు. గురవయ్య నోరు మెదపలేదు. ఈ సారి గురవయ్యను పదిహేను రోజులపాటు సస్పెండ్ చేశాడు కృష్ణమూర్తి.

"రోజురోజుకు గురవయ్యలో మా ఆఫీసర్ చనిపోతే బావుండును అన్నభావం విజృంభించ సాగింది. అతడు వెంటనే చనిపోకపోతే తనైనా వెంటనే అతన్ని చంపెయ్యాలి. కృష్ణమూర్తిని ఎలా హత్య చెయ్యాలో తన మనసులోనే చాలా పథకాలు వేస్తుండేవాడు. చివరకు అతనికో పథకం నచ్చింది. ఆచరణయోగ్యంగా కూడా కనిపించింది.

అదే ఈ రోజు అతను చేసింది.

ఆఫీసర్ బొమ్మనొకదాన్ని తయారు చెయ్యటం.... ఆ బొమ్మను చిత్రవధచేసి చంపెయ్యటం– ఆ బొమ్మకు అంత్యక్రియలు కూడా చెయ్యడం– అదీ అతనికి నచ్చిన పథకం–ఈ రోజు సరిగ్గా ఆ పథకం ప్రకారమే అతడాబొమ్మను తగులబెట్టాడు.

అతనికి అతని గుండెలెంతో తేలిక పడట్టు అనిపించింది ఈ మధ్య చాలా రోజులుగా అతనికి సరిగ్గా నిద్ర పట్టటం లేదు. కాని ఈ రోజు మాత్రం అతనికి చక్కగా నిద్ర పట్టింది. అతనికో కలకూడా వచ్చింది.

అతన్ని పోలీసులు అరెస్టుచేసి జైలుకు తీసికెళ్ళారు. "కృష్ణమూర్తిని చంపింది నువ్వేకదూ" అని అడగారు "ఔను.... నేనే" నని తను నిజం చెప్పేశాడు తనను కోర్టుకుకూడా తీసుకువెళ్ళారు. జడ్జి గారు కూడా "కృష్ణమూర్తిని చంపింది నువ్వేనా" అని అడిగాడు. 'నేనే' నని చెప్పాడు.


# జనాదరణగల పాప్యులారిటీ పోటీ

ఎంట్రీ ఫీజు లేదు - మీరు బహుమతిని గెలుపొందగలరు.

| | | | |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |
| | | | |

మొదటి బహుమతి: ఒక స్కూటరు వెస్పా లేక ఆల్విన్ రిఫ్రిజిరేటర్. 2 వ బహుమతి: ఒక టేపు రికార్డరు లేక ఆటోమాటిక్ కెమెరా లేక రేడియోగ్రాం. 3 వ బహుమతి: (100) టోమో జపాన్ మోడల్ 3 బ్యాండ్ ఆల్‌వరల్డ్ ట్రాన్సిస్టర్లు ధర: రు. 275/–. 4 వ బహుమతి: (10) టోమో జూనియర్ జపాన్ మోడల్ 3 బ్యాండ్ ఆల్‌వరల్డ్ ట్రాన్సిస్టర్ ధర: రు. 250/–.

## మీరు చేయవలసినది?

7 (ఏడు) నుంచి 22 (ఇరువది రెండు) వరకు గల అంకెలను నిలువుగా, అడ్డముగా, అయిమూలగా ఎటుకూడినా మొత్తము 58 (యాభై ఎనిమిది) వచ్చువట్లు ఒక అంకెను ఒకేసారి ఉపయోగించి పై ఖాళీ గడులను పూరించవలయును.

ఎంట్రెన్స్ ఫీజు : ఎంట్రీ ఫీజు లేదు. ఇది ఒక పాప్యులారిటీ పోటీ మాత్రమే.

ఆఖరి పోస్టింగ తేది : 25-4-73. ఫలితం తేదీ : 28-4-73

సహాయము కొరకు 54 మొత్తముగల నమూనా.

| | | | |
|---|---|---|---|
| 10 | 13 | 16 | 15 |
| 17 | 14 | 11 | 12 |
| 19 | 20 | 9 | 6 |
| 8 | 7 | 18 | 21 |

పోటీకి నిబంధనలు : (1) సాదా కాగితము ఉపయోగించాలి. (2) సవరణలు, దిద్దులు, కటింగులుకల ఎంట్రీలు అంగీకరించబడవు. (3 ప్రమోటర్ల తీర్మానము ఖాయమైనది మరియు చట్టబద్ధముగా న్యాయమైనది. ఈ పోటీ విషయములో ఇది ఒక ముఖ్యమైన షరతు. (4) ఎంట్రీలయొక్క సక్రమము మా ఆఫిషియల్ సీల్డు సొల్యూషన్‌తో పరిపోల్చి ఖచ్చితముగా చూడబడును. నగదుగా బహుమతి ఇవ్వబడదు. (5) మొదటి బహుమతి : (1) ఆఫిషియల్ సొల్యూషన్‌తో సక్రమముగా వున్నట్లు కనుగొనబడిన దానికి ఇవ్వబడును. (6) రెండవ బహుమతి : (1) పైన అడ్డముగావున్న మూడు వరుసలలో సమానముగా వున్నదానికి ఇవ్వబడును. (7) మూడవ బహుమతి: (100) మా ఆఫిషియల్ సొల్యూషన్‌తో ఏ వరుసతోనైనా, సంఖ్యతోనైనా, సమానముగా వున్నదానికి ఇవ్వబడును. (8) నాల్గవ బహుమతి: డాల్ ప్రమోటరుకు సంతృప్తినిచ్చిన పది (10) ఎంట్రెంట్స్‌కు ఇవ్వబడును. (9) గెలుపొందిన వారికి సదరు బహుమతులు పొందుటకు పోస్టేజీ, ప్యాకింగ్, లైసెన్సు ఫీజు చెల్లించవలయును. (10) 3వ మరియు 4వ బహుమతి గెలుపొందినవారుకూడా పైన తెల్పిన ఖర్చులతో కూడా ట్రాన్సిస్టరు ఖరీదులో సగం చెల్లించాలి. మరియు మా నిబంధనలకు, షరతులకు లోబడి వుండాలి. (11) ఫలితములు ప్రకటించిన వెంటనే లైసెన్సు ఫీజు వగైరా చెల్లించేందుకు గెలుపొందినవారికి ఉత్తరం పంపబడును. (12) ఫలితములు పొందుటకు 45 పైసలు పోస్టలు స్టాంపులు పంపాలి. (13) ఒక కుటుంబము ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి. (14) అడ్రసు ఇంగ్లీషు లేదా హిందీలో వ్రాయాలి. (15) కటింగ్ లేక నిబంధనల కాపీ భవిష్యత్తులో ఉపయోగానికి ఉంచుకోండి.

Director Contest Department :

**JAPAN AGENCIES (W-58)**

P. O. Box No. 1194. DELHI-6.

జడ్జి తనకు ఉరిశిక్ష విధిస్తున్నట్టు తీర్పు చెప్పాడు.

### 3

ఆ తెల్లారి ఆఫీసుకు వెళ్ళాలంటే గురవయ్యకు భయమేసింది తనను పోలీసులు పట్టుకుంటారేమో. జైల్లో వేస్తారేమో! కానీ అప్పుడే ఈ విషయం ఎవరికీ తెలిసుండదులే అనుకున్నాడు.

నెమ్మదిగా ఆఫీసుకు చేరుకున్నాడు.

సరిగ్గా పదిన్నరకు కృష్ణమూర్తి ఆఫీసుకు వచ్చాడు. గురవయ్యకు తను చూస్తున్నది అసలు కృష్ణమూర్తిని కాదు....కృష్ణమూర్తి దయ్యం రూపంలో ఇలా వచ్చాడనిపించింది. తనకు తెలిసినంతవరకు తను రాత్రే కృష్ణమూర్తిని హత్య చేసేశాడు.

తన పని చూసుకోవటం మొదలెట్టాడు.

ఇంతలో ఆఫీసులో పెద్దకలకలం వినిపించింది.

“ఏమైంది? ఏమైంది?” అని గురవయ్య ఓ ప్యూన్ను అడిగాడు.

“ఆఫీసర్‌గారికి గుండెపోటు వచ్చిందట సార్” అన్నాడతడు.

గురవయ్య నెమ్మదిగా కదిలాడు. అందరూ ఆఫీసర్ రూమ్‌కు పరుగెత్తుతున్నారు. ఆఫీసర్ రూమ్ జనంతో క్రిక్కిరిసిపోయింది. గురవయ్య కూడా అక్కడకు చేరుకున్నాడు.

ఆఫీసర్ కృష్ణమూర్తి విపరీతంగా బాధపడిపోతున్నాడు. అతన్నెవరో సూదులతో గుచ్చుతున్నట్టుగా విలవిల్లాడిపోతున్నాడు. గురవయ్య కళ్ళు తృప్తిగా మెరిశాయి. ఈ దృశ్యం తను ఇదివరకే చూసినటుగా, జరగాల్సిందే జరుగుతున్నటుగా మనస్సులో సంతోషించాడు. ఇంతలో డాక్టరొచ్చాడు.

డాక్టర్ కృష్ణమూర్తిని పరీక్ష చేసి “వీర్ని వెంటనే హాస్పిటల్‌కు చేర్చాల”న్నాడు కాని కృష్ణమూర్తి హాస్పిటల్‌కు చేర్చే లోపలే అతడు ఆఖరు శ్వాస విడిచాడు. అతని ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

ఆఫీసులో అందరూ పసిపిల్లల్లా ఏడవటం మొదలెటారు. ఆఫీసంతా తండ్రిలేని పసివాడిలా రోదించింది.





బలమునకు

ఉత్తమ్ గ్రైప్‌వాటర్

అజీర్ణము, కడుపునొప్పి, ఆకలిమాంద్యము, వాయువు, కలతనిద్ర, వంటి బాధలు తగ్గిపాపాయి ఆరోగ్యం బాగుపడుతుంది



ఎంపీ ఫార్మా విజయవాడ

డిస్ట్రిబ్యూటర్స్: మహావీర్ మెడికల్ స్టోర్సు, ప్రసాద్ & కో, విజయవాడ-1.


గురవయ్యలో మాత్రం చలనంలేదు. ఓ బండరాయిలోనైనా కొంచెం తడి వుంటుందేమోగాని అతని కన్నుల్లో మాత్రం తడిలేదు.

గురవయ్యకో అనుమానం కల్గింది. వీళ్ళకెవళ్ళకూ తనే ఆఫీసర్‌ను చంపినట్టు ఇంకా తెలీదు. తెలిస్తే తనను ఇక్కడికక్కడే చిత్రవధ చేసేస్తారేమోననిపించింది.

కృష్ణమూర్తి శవాన్ని ఓ కార్లోకి ఎక్కించి వాళ్ళ ఇంటికి పంపించారు. ఆఫీసుమూసేసి అందరూ వాళ్ళ ఇంటికి కారు వెనకాలే పరుగెత్తారు. గురవయ్య కూడా వాళ్ళతో బయల్దేరాడు.

కృష్ణమూర్తి భార్య ఈ వార్త వినగానే మూర్ఛపడిపోయింది. అతని ముగ్గురు కొడుకులు, ఇద్దరు బిడ్డలు తండ్రి మీదపడి గుండెలు పగిలేలా ఏడవ సాగారు.

కృష్ణమూర్తి భార్యకు 30 ఏళ్ళుంటాయేమో. కాని చాలా చిన్న వయస్సుదానిలా కనిపించింది. చాలా అందంగా కూడా ఉంది. ఆమె మూర్ఛ నుండి తేరుకున్నాక చాలా హృదయ విదారకంగా ఏడ్చింది. గురవయ్య ఏడుస్తున్న కృష్ణమూర్తి పిల్లల్ని, భార్యను చూశాడు. అతని గుండెలు కదిలాయి అతనికి జాలేసింది. తను పొరపాటే చేశాడు. కృష్ణమూర్తిని అందరూ మంచివాడని, సమర్థుడని పొగుడుతారు. నిజానికతడు మంచివాడే. తనకు పని చెయ్యటం చేతకాదు. కాబట్టే తనను శిక్షించాడు. అంతమాత్రాన తను అతన్ని హత్య చెయ్యాలా?

అందరితోపాటే గురవయ్య ఆ రోజంతా కృష్ణమూర్తి ఇంట్లోనే ఉన్నాడు. అతని దహన క్రియలన్నీ చూశాడు. రాత్రి బాగా పొద్దుపోయాక ఇల్లు చేరాడు.

### 4

ఇవ్వాళోరేపో, తనకోసం పోలీసులు వస్తారని గురవయ్య ఎదురు చూడసాగాడు. తలుపు కిర్రుమన్నా, బయట బూట్లచప్పుడైనా, జీపు చప్పుడైనా విపరీతంగా వణికిపోయేవాడు.

“అదిగో వస్తున్నారు....తనను అరెస్టు చేస్తారు. ఉరితీస్తారు. తనెక్కడికైనా పారిపోవాలా? లేదు. పారిపోయినా లాభంలేదు. తను ఎక్కడున్నా తనను పోలీసులు వేటాడతారు. పట్టుకుంటారు. ఉరితీస్తారు.... తప్పదు. తను చనిపోతే తనకోసం ఏడ్చే వాళ్ళెవ్వరూ లేరు. తనను తన భార్య ఏనాడో వదిలేసింది. తనలాంటి ఎందుకూ కొరగానివాడితో వేగలేనని నానా బూతులు తిట్టి తన దారిన తాను వెళ్ళిపోయింది. ఈ

మధ్యనే ఎవడితోనో లేచిపోయిందట తనకు పిల్లలూ, జెల్లలూ ఎవరూ లేరు తనను ఉరితీస్తే, తను చనిపోతే తనకోసం కృష్ణమూర్తి కోసం యేడ్చేనట్టుగా ఎవరూ ఏడ్వరు.

పాపం కృష్ణమూర్తి! కృష్ణమూర్తి పది కాలాలపాటు బతకాల్సిన వాడు. అతన్ని ఎంతోమంది ప్రేమించారు. అతని మీద ఆధారపడి బతుకుతున్న ఓ పెద్దకుటుంబం దిక్కులేనిదై పోయింది. అంత చిన్న వయస్సులోనే అతని భార్యకు వైధవ్యం ప్రాప్తించింది. తను చాలా ఘోరమే చేశాడు. తను ఛస్తే లోకానకేమి నష్టం లేదు. కాని కృష్ణమూర్తిలాంటివాడు చని పోవటంవల్ల లోకానికి చాలా నష్టమే వాటిల్లింది. తను క్షమించరాని నేరం చేశాడు.

ఎప్పుడూ నిద్రపోయే గురవయ్యకు రాత్రుళ్ళుకూడా నిద్రపట్టటం మానేసింది. ప్రతిక్షణం ఏదో జరుగుతుందని ఎదురు చూడసాగాడు. చీమ చిటుక్కుమన్నా లేచి కూర్చొనేవాడు. తలుపు కిర్రుమన్నా, కిటికీ తలుపులు కొట్టుకున్నా, రోడ్డుమీద జీపు చప్పుడైనా లేక పక్కింట్లో అడుగుల చప్పుడైనా "అదిగో వస్తున్నారు....తను వెళ్ళాలి" అనుకుంటూ బట్టలేసుకొని తయారుగా వుండేవాడు. ఎంతకూ ఎవరూ రాకపోవటంతో విసిగిపోయేవాడు.... లేదు.... వాళ్ళకింకా తెలియలేదు. పోలీసు వాళ్ళు వట్టి చేతకాని వాళ్ళు ఇంత చిన్న విషయం తెలుసుకోటానికి వీళ్ళకింత టైమ్‌పడ్తుందా? అనుకున్నాడు.

ఎంతో కష్టంమీద ఎన్నోసార్లు పక్క మీద అటూ ఇటూ దొర్లాక అతనికి కాస్సేపు కునుకుపట్టేది. వెంటనే అతనికి భయంకరమైన కలలొచ్చేవి. కృష్ణమూర్తి, పోలీసులు, న్యాయస్థానాలు, లాయర్లు, ఉరితాడు, ఉరితీసేవాళ్ళు అతనికి వివిధ రూపాల్లో కనిపించేవాళ్ళు. అతడు వెంటనే లేచి కూర్చునేవాడు.

వారం రోజులు గడిచాయి.

గురవయ్య రోజు రోజుకు కృంగి, కృశించి పోసాగాడు. అతనికి అన్నం రుచించటం లేదు. నిద్రపట్టటంలేదు. యేమి చెయ్యాలనిపించటం లేదు.

ఓరోజు ఆఫీసులో తన పక్కనే కూర్చొనే క్లర్కు సత్యనారాయణతో గురవయ్య అన్నాడు.

"మీకో రహస్యం చెప్పాలి. కాస్సేపు బయటకొస్తారా?"

సత్యనారాయణ గురవయ్య కేసి వింతగా చూశాడు రెండేళ్ళుగా తన పక్కనే కూర్చుని పని చేస్తున్నా తనతో ఏనాడూ మాట్లాడని గురవయ్య ఈ రోజు తనకో రహస్యం చెబుతానని పిలవటం అతన్ని నిజంగా ఆశ్చర్యపరచింది.

"పదండి" అంటూ సత్యనారాయణ లేచాడు.

ఇద్దరూ ఆఫీసు క్యాంటీన్‌లో ఓ మూల కూర్చున్నారు.

క్యాంటీన్‌లో ఆ టైమప్పుడు ఎవరూ ఉండరు. రెండుటీలకు ఆర్డరిచ్చి చెప్పండి' అన్నాడు సత్యనారాయణ.

గురవయ్య విపరీతంగా వణకటం మొదలెట్టాడు.

చాలా రోజులుగా నిద్రలేక అతనికళ్ళు లోపలకు పీక్కుపోయాయి. తైల సంస్కారంలేక తలంతా రేగి అసహ్యంగా ఉంది. మొదలే నల్లగా కమిలిన మొఖంలో, లావు పెదాలతో వికారంగా ఉండే గురవయ్య ఇంకా వికారంగా, భయంకరంగా కనిపించాడు. సత్యనారాయణ చెయ్యిపట్టుకుంటూ గుసగుసగా అన్నాడు.

"మన ఆఫీసర్ కృష్ణమూర్తిని నేనే చంపాన్ సార్....హత్య చేశాను...."

క్షణంసేపు సత్యనారాయణ గురవయ్య కేసి నోరుతెరుచుకొని చూశాడు. గురవయ్య అంటున్నదేమిటో అతనికి వెంటనే బోధపడలేదు.

"మీరు నమ్మటంలేదు కదూ, నిజం సార్ మన ఆఫీసర్‌ను నేనే చంపేశాను. ఈ విషయం ఎవరికీ తెలియదు. చాలా రహస్యంగా చేసేశాను. పోలీసులకక్కూడా ఇంకా తెలియదు........"

"మిస్టర్ గురవయ్యా! మీకు పిచ్చెక్క లేదుగదా! మీరు యేం మాట్లాడుతున్నారో మీకు తెలుసా?" అన్నాడు సత్యనారాయణ.



# హత్య

"నాకు పిచ్చెక్కటం ఏమిటి? మీకెందు కొచ్చిందా సందేహం" అన్నాడు గురవయ్య.

"మన ఆఫీసర్‌ను ఎవరూ చంపలేదు. గుండెపోటుతో అతడే సహజంగా చనిపోయాడు. అతడు చాలా కాలంగా గుండెపోటుతో బాధపడుతున్నాడు. నువ్వు చంపటమేమిటి? నాన్‌సెన్స్. నాతో అన్నావు గానీ యింకెవరితోను అనకు. నిన్ను మెంటల్ హాస్పిటల్లో జాయిన్ చేస్తారు– జాగ్రత్త!" అంటూ టీ తాగటం ముగించి సత్యనారాయణ వెళ్ళిపోయాడు.

గురవయ్య అలాగే చాలాసేపు కూర్చున్నాడు. పూర్‌ఫెలో సత్యనారాయణ, అందరిలాగే అతడూ మోసపోయాడు. ఆఫీసర్ గుండెపోటుతో చనిపోయాడని నమ్ముతున్నాడు. పిచ్చివాడు. అంతా పిచ్చివాళ్ళే–తన మాట ఎవరూ నమ్మటం లేదు.

గురవయ్యలో ఉద్భవించిన అశాంతి అంతకంతకు దావానలంలా ప్రజ్వరిల్లి అతన్ని దహించివేయసాగింది. అతన్ని గుండెల్లో ఎవరో నిరంతరం వేయి సూదులతో గుచ్చుతున్నంత బాధ.... అతని మస్తిష్కంలో లక్ష అగ్ని పర్వతాలు బద్దలౌతున్నంత గందరగోళం.... కళ్ళు మూసుకుంటే అతనికి ఉరితాడు........ కోటి రూపాలతో కోటి రంగుల్లో కనిపించసాగింది. తిండి, పీళ్ళు, నిద్ర అతని దరిదాపులకు రాలేకపోయాయి యేదో జరుగుతుంది....ఎవరో వస్తారు.... తననెక్కడికో తీసుకుపోతారు తననీ బాధనుండి శాశ్వతంగా విముక్తుణ్ణి చేస్తారని ఎదురు చూసి ఎదురు చూసీ అతని సర్వశక్తులూ హరించిపోయాయి.

పదిహేను రోజులు గడిచాయి.

ఓ రోజు అర్థరాత్రి అకస్మాత్తుగా పక్కమీది నుండి లేచి నిద్రలో నడచిపోతున్నట్టుగా నడుస్తూ గురవయ్య పోలీసు స్టేషన్ చేరుకున్నాడు.

"యేం కావాలండి" అన్నాడు డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్. "ఎస్. ఐ. తో మాట్లాడాలి" అన్నాడు గురవయ్య.

కానిస్టేబుల్ గురవయ్యను ఎస్. ఐ. దగ్గరకు తీసుకెళ్ళాడు.

ఎవరితోనో మాట్లాడి అప్పుడే ఫోన్ పెట్టేస్తున్న ఎస్. ఐ. తో "ఈయనెవరో మీతో మాట్లాడాలట సార్" అని చెప్పి కానిస్టేబుల్ వెళ్ళిపోయాడు.

"చెప్పండి" అన్నాడు యస్. ఐ గురవయ్యను ఎగాదిగా చూస్తూ.

గురవయ్య రూపం చాలా భయంకరంగా ఉంది. కళ్ళు చింతనిప్పుల్లా ఉన్నాయి. జుట్టంతా చిందరవందరగా రేగి ఉంది. మనిషి యే క్షణంలోనైనా కింద పడిపోతాడన్నట్టుగా ఉన్నాడు.

"మీరైనా నేను చెప్పేది నమ్మాలి సార్ మీరు కూడా అందరిలా నవ్వేసి నన్నో పిచ్చివాడికింద జమకట్టకండి సార్" అన్నాడు గురవయ్య సబ్‌ఇన్‌స్పెక్టర్ చేతులు పట్టుకుంటూ.

అతన్ని కుర్చీలో కూర్చోబెట్టి.

"ఏమిటో చెప్పవయ్యా మొదలు" అన్నాడు ఎస్. ఐ.

"నేనో వ్యక్తిని హత్య చేశాను సార్. మీరు వెంటనే నన్ను అరెస్ట్ చెయ్యకపోతే నేను బతకలేను."

సబ్‌ఇన్‌స్పెక్టర్ కళ్ళకు పట్టిన నిద్ర మత్తు వదిలిపోయింది. అతడు కుర్చీలో సరిగ్గా కూర్చుంటూ.

"యేమిటీ? మళ్ళీ చెప్పు" అన్నాడు.

"నేను.... నేను....మా ఆఫీసర్ కృష్ణమూర్తిని చంపేశాను సార్. యింతకాలం దొరక్కుండా తప్పించుకున్నాను కాని నా అంతట నేనే పోలీసులకు లొంగిపోవటం మంచిదని యిలా వచ్చేశాను సార్" అన్నాడు గురవయ్య.

"ఎక్కడ జరిగిందా హత్య?"

"ఇక్కడే సార్....ఈ ఊళ్ళోనే"

"ఈ మధ్య ఈ ఊళ్ళో హత్యలేవీ జరగలేదే?"

"జరక్కపోవటమేమిటి? 15 రోజుల క్రితం రెవెన్యూ ఆఫీసర్ కృష్ణమూర్తిని నేను హత్యచేయలేదూ?"

"రెవెన్యూ ఆఫీసర్ కృష్ణమూర్తా? అతడు హార్ట్‌ఎటాక్‌తో చనిపోయాడు గదయ్యా?"

"అక్కడే సార్ మీరంతా పొరబడుతున్నారు, అతన్ని నేను నా చేతులతో చంపేశాను. అతనిమీద కిరోసిన్ పోసి అగ్గిపెట్టె గీసి అంటించాను.... పాపం....చాలా ఘోరమైన చావు చచ్చాడులెండి. ఈ విషయం ఎవరికీ తెలియదు. అంతా అతడు హార్ట్ ఎటాక్‌తో చనిపోయాడనుకుంటున్నారు– మీరు కూడా ఓ పోలీసు ఆఫీసరయ్యుండి ఈ మాత్రం తెలుసుకోలేకపోతే ఎలా సార్"

"యేయ్ మిష్టర్ .... నువ్వేం చేస్తున్నావు? వాటీజ్ యువర్ ప్రొఫెషన్"

"రెవెన్యూ ఆఫీసులో క్లర్కుగా...."

"బట్ ఆర్ యూ మెంటల్లీ ఆల్‌రైట్ ....నీ బుర్ర సరిగా పని చేస్తున్నదా? అని ....లేక ఇదంతా ఫన్ కోసమా?"

"అదేమిటి సార్ అలా అంటారు"

"నువ్వు మళ్ళీ అలాగే వాగావంటె నిన్ను వెంటనే పిచ్చాసుపత్రిలో జాయిన్ చేయిస్తాను.... జాగ్రత్త! ఇదేమనుకున్నావు? పోలీసు స్టేషన్ అనుకున్నావా? లేక నీ ఇల్లనుకున్నావా? మమ్మల్ని ఫూల్స్‌ని చేద్దామని ప్రయత్నిస్తున్నావా యేం? ఇక నువ్వు వెళ్ళొచ్చు....యేయ్ ఫోర్‌నాట్ త్రీ.... ఈ పెద్దమనిషిని బయటకు పంపించు" అన్నాడు ఎస్. ఐ.

గురవయ్య పోలీసు స్టేషన్ బయట కొచ్చాడు.

* * *

రెండుమూడు రోజుల తర్వాత ఇదే సబ్ ఇన్‌స్పెక్టర్ తన ఇంట్లో ఉరేసుకొని చనిపోయిన గురవయ్య శవాన్ని చూసి షాక్ తిన్నాడు. గురవయ్య చెప్పిన విషయాన్ని కొంచెం సీరియస్‌గా తీసుకొని, అతన్నో కంట కనిపెట్టిఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదేమో ననుకున్నారు గురవయ్య కొలీగ్ సత్యనారాయణ, ఆ సబ్ ఇన్‌స్పెకర్.

★

